సాక్షి అన్నమయ్య జిల్లా

మంగళవారం । 4 । మార్చి । 2025

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళ॥ (సా॥)	సహర్ బుధ॥ (ఉ॥)
రాయచోటి :	6.28	5.09
రాజంపేట :	6.26	5.17
పీలేరు :	6.29	5.09
మదనపల్లె :	6.30	5.11



భక్తిశ్రద్ధలతో ధ్వజావరోహణం

రాయచోటిలోని వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 9వ రోజు స్వామి వారి ధ్వజావరోహణ కార్యక్రమాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.110	రూ.130
రెండోరకం	రూ.80	రూ.100

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 65 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

ప్రారంభమైన ఓపెన్ ఇంటర్ పరీక్షలు

రాజంపేట టౌన్ : జిల్లాలో ఓపెన్ ఇంటర్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలోని రాయచోటిలో నాలుగు, రాజంపేటలో మూడు, మదనపల్లెలో మూడు కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. తొలిరోజు జరిగిన ఇంగ్లీష్ పరీక్షకు 1,878 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1,676 మంది హాజరయ్యారని ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ జిల్లా కో–ఆర్డినేటర్ కె.శ్రీనివాసరాజు తెలిపారు. ప్రతి కేంద్రంలోనూ ఇద్దరు చొప్పున సిట్టింగ్ స్క్వాడ్‌ను, అలాగే మూడు ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు.

గృహ విద్యుత్ అదనపు లోడు క్రమబద్ధీకరణకు రాయితీ

రాయచోటి జగదాంబసెంటర్ : ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఆర్‌ఈసీ) తక్కువ లోడ్‌తో విద్యుత్ కనెక్షన్ తీసుకొని ఎక్కువ విద్యుత్ వినియోగిస్తున్న గృహ వినియోగదారులకు అదనపు లోడును 50 శాతం రాయితీతో క్రమబద్ధీకరించుకునే అవకాశం కల్పించింది.ఈ అవకాశాన్ని రాయచోటి డివిజన్ పరిధిలోని గృహ విద్యుత్ వినియోగదారులు ఉపయోగించుకోవాలని ఏపీఎస్పీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పేరూరి యుగంధర్ తెలిపారు. సోమవారం రాయచోటిలో ఆయన మాట్లాడారు. వినియోగదారులు తమ ఇళ్లకు అడిషనల్ లోడ్ 50 శాతం రాయితీకి ఈ నెల 1వ తేదీ నుంచి జూన్ 30వ తేదీలోపు మీ సర్వీస్ నంబర్, మీ ఆధార్‌కార్డు తీసుకొచ్చి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

బాలికలకు చట్టాలపై అవగాహన తప్పనిసరి



బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులు

రాయచోటి అర్బన్ : బాలికలకు చట్టాలపై తప్పనిసరిగా అవగాహన ఉండాలని జిల్లా స్త్రీ,శిశు సంక్షేమ సాధికారత అధికారిణి పి.రమాదేవి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని నేతాజీ సర్కిల్ వద్ద ఉన్న ప్రభుత్వ ఉన్నతపాఠశాల మైదానం నుంచి కలెక్టరేట్ వరకు మహిళా ఉద్యోగులు బైక్‌ర్యాలీని నిర్వహించారు. ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ బేటీ బచావో– బేటీ పఢావో కార్యక్రమం ద్వారా జిల్లావ్యాప్తంగా బాలికలకు అవగాహన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు చెప్పారు. బాల్య వివాహాల నిర్మూలన, బాలికావిద్యను ప్రోత్సహించడం తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కిషోరబాలికల వికాసం కార్యక్రమాల్లో భాగంగా అంగన్‌వాడీ సెంటర్ పరిధిలో డ్రాపౌట్స్‌ని గుర్తించి 10 నుంచి 15 మందికి మించకుండా సఖి సమూహాలను మహిళా సంరక్షణ కార్యదర్శి ద్వారా ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో కూడా సఖి సమూహాలను ఏర్పాటు చేసి చట్టాలపై అవగాహనను కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ సంస్థల హెచ్‌ఓడీలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు, మహిళా సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు.

లక్ష్యం.. నిర్లక్ష్యం

పిల్ల కాలువలకు మంగళం

- అన్నమయ్య, చిత్తూరుజిల్లాల్లో 2,18,800 ఎకరాలకు చుక్కనీరు అందదు
- కుప్పం రైతాంగానికి ఇదే పరిస్థితి
- కృష్ణా జలాల తరలింపు లక్ష్యం నెరవేరదు
- కొత్తగా లైనింగ్ పనులతో రైతులకు తీవ్ర నష్టం



బి.కొత్తకోట వద్ద పుంగనూరు ఉపకాలువకు లైనింగ్ పనులు

బి.కొత్తకోట : హంద్రీ–నీవా రెండో దశ సాగు, తాగునీటి ప్రాజెక్టు పనుల్లో కూటమి ప్రభుత్వం ఉపకాలువల లైనింగ్ పనులకు ప్రాధాన్యత ఇచ్చి పిల్ల కాల్వల తవ్వకం పనులు వదిలేసుకోవడంతో కరువు రైతాంగం తీవ్రంగా నష్టపోతోంది. 1994, 2005లో ప్రాజెక్టు పనులు చేపట్టేలా రూపొందించిన డీటైల్ ప్రాజెక్టు నివేదికల్లో ప్రాజెక్టు ఉపకాలువల నుంచి పిల్ల కాల్వలను తవ్వించి వాటి ద్వారా చివరి ఆయకట్టు భూమికి సాగునీరు అందించాలన్నది లక్ష్యం. ఒక ప్రాజెక్టు నుంచి చివరి ఆయకట్టు భూమి వరకు సాగునీరు వెళ్లాలంటే దాని ప్రధాన లేదా ఉపకాలువ నుంచి పిల్ల కాలువలను తవ్వించాలి. అయితే ఈ పనులను చేపట్టేందుకు కూటమి ప్రభుత్వం సుముఖంగా లేదు. కాంట్రాక్టర్లకు ప్రయోజనం చేకూర్చే పనులపైనే దృష్టి పెట్టింది. కరువుతో కష్టాలు పడుతున్న రైతాంగాన్ని ఇంకా కష్టాల్లోకి నెట్టేస్తోంది.

కిరణ్ పెంచగా..వద్దన్న బాబు

ప్రాజెక్టు పనులు చేపట్టిన కాంట్రాక్టర్ల ఒప్పందం మేరకు ఎకరాకు రూ.4,700తో పిల్లకాలువ పనులు చేయాలి. మధ్యలో కల్వర్టులు, రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణం చేయాల్సివస్తే కాంట్రాక్టర్లే చేపట్టాలి. ఉమ్మడి రాష్ట్ర సీఎం కిరణ్ సర్కారులో ఎకరాకు అదనంగా రూ.5,800 పెంచి రూ.10,500గా నిర్ణయించారు. 2014లో అధికారం చేపట్టిన చంద్రబాబు పిల్ల కాలువల పనులు చేపట్టకుండా కాంట్రాక్టర్లకు మేలు చేకూర్చేలా 2015లో జీవో 22 జారీతో ఈ పనులను కాంట్రాక్టర్లు వదిలేసుకున్నారు. ఫలితంగా రైతాంగానికి తీవ్ర నష్టం కలుగుతున్నా చంద్రబాబు సర్కార్‌కు ఏమాత్రం పట్టలేదు. ఇదే కథ మళ్లీ పునరావృతమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పనుల స్వరూపాన్నే మార్చేసి వారికి ఇష్టమైన పనులే చేపడుతున్నారు. కాగా చిత్తూరుజిల్లాకు సంబంధించి 60, 61 ప్యాకేజీల్లో పిల్ల కాలువల పనులు జరిగాయి.

లైనింగ్ పనులతో ముందుకే

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.1,217 కోట్లతో పుంగనూరు ఉపకాలువను వెడల్పు చేసి రైతులకు ప్రయోజనం కల్పించాలని నిర్ణయిస్తే కూటమి ప్రభుత్వం ఈ పనిపై కక్ష కట్టింది. గత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని వెడల్పు పని రద్దు చేసి కాంక్రీట్ లైనింగ్ పని చేయిస్తున్నారు. దీనివల్ల కాంట్రాక్టర్‌కు తప్ప రైతులకు ప్రయోజనం లేదు. కాలువకు స్లూయిజ్‌ల నిర్మాణం చేపట్టకుండా కేవలం సమీపంలోని చెరువులకు మాత్రమే నీటిని అందించి చేతులు దులుపుకునే పరిస్థితులు నెలకొన్నాయి. పిల్ల కాలువలు తవ్వించి 2,18,800 ఎకరాల సాగుకు నీరివ్వకుండా కొన్ని చెరువులు నింపేందుకే ఆసక్తిగా ఉంది. పిల్ల కాలువలు వదిలేయడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోతోంది. ఫలితంగా కాలువసాగే మార్గంలో ఒక్క ఎకరాకు సాగునీరు అందదు. ఫలితంగా ప్రాజెక్టు లక్ష్యం నీరుగారిపోతోంది.

ప్రాజెక్టు పరిధిలో ఆయకట్టు సాగు వివరాలు

ఉపకాలువ	కి.మీ	ఆయకట్టు (ఎకరాల్లో)
తంబళ్లపల్లె ఉపకాలువ	30.750	15,000
పుంగనూరు ఉపకాలువ	224.5	85,900
వాయల్పాడు ఉపకాలువ	23.50	17,200
నీవా ఉపకాలువ	122.5	57,500
చింతపర్తి డిస్ట్రిబ్యూటరీ	42.30	22,400
ఎల్లుట్ల డిస్ట్రిబ్యూటరీ	25.17	15,400
సదుం డిస్ట్రిబ్యూటరీ	19.1	5,400

28 మండలాలకు తీవ్ర నష్టం

పిల్ల కాలువ పనులు జరక్కపోవడంతో అన్నమయ్య, చిత్తూరుజిల్లాల్లోని 28 మండలాలు కరువు పరిస్థితుల నుంచి గట్టెక్కలేని పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుంది. బి.కొత్తకోట, ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం, తంబళ్లపల్లి, కురబలకోట, మదనపల్లి, పెద్దమండ్యం, పుంగనూరు, చౌడపల్లి, పులిచర్ల, సదుం, పలమనేరు, పెద్దపంజాణి, గంగవరం, చిత్తూరు, గుడిపాల, పాకాల, చంద్రగిరి, కేవీ.పల్లి, వాయల్పాడు, కలకడ, కలికిరి, గుర్రంకొండ, పీలేరు, పెనుమూరు, పూతలపట్టు, ఐరాల, తవణంపల్లి మండలాలకు సాగునీరు అందక తీవ్రంగా నష్టపోతున్నాయి. ప్రభుత్వ నిర్ణయంతో ఈ మండలాలకు నిర్ణయించిన ఆయకట్టు భూమికి కృష్ణాజలాలతో పంట సాగు కలలో మాటగా మిగిలిపోవడం ఖాయం.

కుప్పానికి ఇదే పరిస్థితి

సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గ రైతుల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. కుప్పం ఉపకాలువ నుంచి 6వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. ఇక్కడి 110 చెరువులకు కృష్ణా జలాలను తరలించి నీటిని అందిస్తారు. అయితే రెండుచోట్ల పిల్ల కాలువలను తవ్వించాల్సి ఉన్నప్పటికీ దీనిపై ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదు. కుప్పం నియోజకవర్గంలో 77, పలమనేరు నియోజకవర్గంలో 33 చెరువులకు కృష్ణా జలాలు అందించే ప్రణాళికపై చర్యలు తీసుకుంటారో లేదో స్పష్టత లేదు. కుప్పం కాలువకు లైనింగ్ పనులు చేస్తున్నందున ఆ ప్రభావం రెండు నియోజకవర్గాలపై పడనుంది.

పిల్ల కాలువలతోనే సస్యశ్యామలం

ప్రస్తుత అన్నమయ్య, చిత్తూరుజిల్లాలో సాగే హంద్రీ–నీవా ప్రాజెక్టు ఉపకాలువల నుంచి రైతుల పొలాలకు నీళ్లు అందించేలా ప్రతి 40 నుంచి 100 ఎకరాలకు ఒక పిల్ల కాలువను తవ్వాలి. దీనికి నీటిని తరలించేలా ఉపకాలువ వద్ద స్లూయిజ్‌లను నిర్మించాలి. ఇలా చేయడం ద్వారా రెండు జిల్లాలకు చెందిన తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు, పుంగనూరు, పలమనేరు, చిత్తూరు, పూతలపట్టు, చంద్రగిరి నియోజకవర్గాల్లోని 2,18,800 ఎకరాలకు శ్రీశైలం నుంచి ఇక్కడికి తరలించే కృష్ణా జలాలను సాగుకు అందించాలి. అయితే ప్రభుత్వం వీటిని తవ్వించేందుకు సుముఖంగా లేదు. రైతు ప్రయోజనాలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా లైనింగ్ పనులపైనే శ్రద్ధ చూపుతోంది.

ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రశాంతం

రాయచోటి/మదనపల్లె సిటీ : ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. సోమవారం జిల్లా వ్యాప్తంగా 49 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. 13201 మంది విద్యార్థులకు 12638 మంది హాజరయ్యారు. పరీక్షల నిర్వహణలో లోటుపాట్లు లేకుండా విద్యార్థులకు తగిన మౌలిక వసతులు కూడా కల్పించామని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఎం కృష్ణయ్య తెలిపారు.

పరీక్షా కేంద్రాల వద్ద సౌకర్యాలు లేవు

మదనపల్లె పట్టణంలోని ప్రైవేట్ కాలేజీల్లో విద్యార్థులు పరీక్ష రాసేందుకు కనీస సౌకర్యాలు లేవని ఎస్ఎఫ్ఐ నాయకులు సోమవారం సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు వినతిపత్రం అందజేశారు. నారాయణ కాలేజీలో ఒక బిల్డింగ్‌లో రెండు పరీక్షా కేంద్రాలు ఇచ్చారన్నారు. బెంగుళూరురోడ్డులోని ప్రైవేటు కాలేజీలో కనీసం మౌలిక వసతులు లేవన్నారు. కదిరిరోడ్డులోని ప్రైవేటు కాలేజీ వద్ద వ్యాపార సముదాయాలు ఉన్నాయన్నారు. ప్రశాంత్‌నగర్‌లోని ప్రైవేటు కాలేజీలో గదుల్లో సరైన వెలుతురు లేదన్నారు. పరీక్షా కేంద్రం వద్ద వైద్య సిబ్బంది అందుబాటులో లేరన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నరసింహ, నాయకులు ఆఫ్రిద్, జయబాబు, సమీర్, ప్రేమ్, సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.



పరీక్షలు రాసేందుకు వస్తున్న విద్యార్థులు

సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

రాయచోటి : ప్రజల సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని పిజీఆర్ఎస్ హాల్‌లో సోమవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 228 అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ప్రతి సమస్యపై ప్రజల నుంచి వచ్చే ఫీడ్‌బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని కలెక్టర్ అన్నారు. కాబట్టి అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరుశాతం పరిష్కరించాలన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా వచ్చిన అర్జీదారులకు జిల్లా కలెక్టర్ స్నాక్స్, వాటర్ బాటిల్స్, టీ సౌకర్యాలను కల్పించారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డిఆర్‌ఓ మధుసూదన్ రావు, ఎస్‌డీసీ రమాదేవి పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రాధాన్యత

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో డిగ్రీ ఆపై తరగతులు చదువుతున్న ఆరుగురు విభిన్న ప్రతిభావంతులకు కలెక్టర్ చేతులు మీదుగా ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారు.



ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్

జాతీయ దివ్యాంగుల ఆర్థిక అభివృద్ధి పథకం ద్వారా టెంట్ హౌస్ వ్యాపారంతో స్వయం ఉపాధి పొందేందుకు షేక్ జిలానీకి రూ. 5 లక్షలు రుణం చెక్కును అందజేశారు.

గోడపత్రాల ఆవిష్కరణ

రాయచోటి జగదాంబసెంటర్ : ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా 'పిల్లల చెవి ఇన్ఫెక్షన్‌ను ఎలా నయం చేసుకోవచ్చు' అనే విషయంపై గోడపత్రికను జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మార్చి 3న ప్రపంచ వినికిడి దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. పిల్లలలో వచ్చే చెవి ఇన్ఫెక్షన్‌ను తల్లిదండ్రులు జాగ్రత్తగా గమనించాలని, ఈఎన్‌టీ వైద్యుడిని మాత్రమే సంప్రదించాలని సూచించారు. సొంత వైద్యం చేయరాదని, ఆకుపసరు లేదా నాటువైద్యుల సలహాలు పాటించరాదని పేర్కొన్నారు.

రాజకీయ కుట్ర

- అనుభవంలో ఉన్న భూమికి సంబంధించి కోర్టుకు ఆధారాలు
- 100, 200 ఎకరాలు ఆక్రమించారంటూ విష ప్రచారం
- మానసికంగా ఆకేపాటిని దెబ్బతీయాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం

సాక్షి, రాయచోటి : ప్రజాక్షేత్రంలో పట్టున్న నేతగా నిరూపించుకున్న ఆకేపాటిపై ఆడని అబద్ధాలు లేవు. పచ్చ పత్రికలకు లీకులు ఇస్తూ ఏదో ఒక రకంగా అభాసుపాలు చేయడమే లక్ష్యంగా పావులు కదిపారు. 100 ఎకరాలు..కాదు కాదు...200 ఎకరాలు..కాదు 300 ఎకరాలు ఆక్రమించారంటూ ఇష్టానుసారంగా ఫిర్యాదులు చేస్తూ మానసికంగా కుంగిపోయేలా వ్యూహం అమలు చేశారు. ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న ఆకేపాటిని సర్కార్ టార్గెట్ చేసింది. భూములే కాదు..ఇతర సమస్యలు కూడా దరిచేరకుండా ఉండాలంటే పార్టీ మారడమే మీ ముందున్న లక్ష్యం అన్నట్లు ఆకేపాటి కుటుంబంపై ఒత్తిడి వచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఆది నుంచి వైఎస్ కుటుంబానికి విధేయుడిగా ఉన్న ఆకేపాటి అన్నింటినీ సున్నితంగా తిరస్కరిస్తూ న్యాయ పోరాటం చేస్తున్నారు.

ఆకేపాటి కుటుంబంపై కుట్రలు

వైఎస్సార్ సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డితోపాటు ఆయన కుటుంబంపై కుట్రలు కొనసాగుతున్నాయి. వైఎస్ కుటుంబానికి విధేయుడిగా ఉంటూ మంచి మనిషిగా గుర్తింపు పొందిన ఆకేపాటి అమర్‌నాథరెడ్డిని పార్టీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. అప్పటి నుంచి వైఎస్సార్ సీపీని అన్ని విధాలుగా బలోపేతం దిశగా తీసుకెళుతూ కార్యకర్తలు, నాయకుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తూ ఆకేపాటి విమర్శలు గుప్పిస్తూ వస్తున్నారు. కూటమి సర్కార్ అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం సాగిస్తున్నారు. అధికారుల తీరుపై కూడా ఉదాసీన వైఖరి కాకుండా బహిరంగంగా విమర్శిస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆకేపాటిని అభాసుపాలు చేయాలన్న దురుద్దేశంతో అధికారుల ద్వారా దెబ్బతీసే ప్రయత్నాలు చేశారు. రాజకీయ కుట్రలో భాగంగా ఆయన ఇంటిని అక్రమంగా నిర్మించుకున్నారని,భూములను ఆక్రమించుకుని సాగు చేస్తున్నారని ఫిర్యాదులతో నాటకాన్ని రక్తికట్టించారు. ఆకేపాటిపై భూముల విషయంలో ఒకవైపు సోషల్‌మీడియాలోనూ, మరోవైపు ఫిర్యాదుల ద్వారా...ఇంకోవైపు పచ్చ పత్రికల ద్వారా విషం చిమ్మారు. వందల ఎకరాలు ఆక్రమించారంటూ ఇష్టానుసారంగా కథలు అల్లారు. అయితే జిల్లా అధికారులు ఆన్‌లైన్‌లో ఉన్న 36 ఎకరాలు తొలగించడం, రిజిస్ట్రేషన్లు రద్దు చేయడాన్ని తీవ్రంగా ఆక్షేపిస్తూ ఆకేపాటి కుటుంబం న్యాయ పోరాటం కొనసాగిస్తోంది. అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల మనిషిగా గుర్తింపు పొందిన ఆకేపాటి సైలెంట్‌గానే ఆరోపణలకు దీటుగా తగిన సాక్ష్యాలతో దీటుగా సమాధానమిస్తున్నారు.

ఆకేపాడు భూములపై హైకోర్టు స్టేటస్ కో

అన్నమయ్య జిల్లా రాజంపేట పరిధిలోని ఆకేపాడు భూములపై హైకోర్టు స్టేటస్ కో విధించింది. సుమారు 36 ఎకరాలకు సంబంధించి ప్రభుత్వం ఆకేపాటి కుటుంబ సభ్యుల పేర్లు రికార్డుల నుంచి తొలగించడం, రిజిస్ట్రేషన్లు రద్దు చేయడంపై ఆకేపాటి హైకోర్టును ఆశ్రయించారు. అంతేకాకుండా సుమారు 30 ఏళ్లకు పైగా తమ ఆధీనంలో ఉన్నట్లు కోర్టుకు వివరించారు. ఎన్నో ఏళ్ల నుంచి తమ అనుభవంలో భూమి ఉందన్నారు. ఇప్పుడు ఫిర్యాదులంటూ రికార్డుల్లో చెరిపి వేయడం ఏమిటని ఆకేపాటి న్యాయవాది ద్వారా వాదనలు వినిపించారు. ఇష్టానుసారంగా వందల ఎకరాలు ఆక్రమించారంటూ విష ప్రచారం చేశారని కోర్టుకు విన్నవించారు. అంతేకాకుండా ఆకేపాటి భూములకు సంబంధించిన పూర్తి ఆధారాలను కోర్టుకు సమర్పించడంతో....ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు భూమిపై స్టేటస్‌కో విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రదక్షిణలు.. పడిగాపులు

- జిల్లాలో రైతులకు అందని గుర్తింపు కార్డులు
- ఆన్‌లైన్‌లో కనిపించని 41 గ్రామాల భూముల వివరాలు
- అన్నదాతకు తప్పని ఎదురుచూపులు

గుర్రంకొండ : రైతులకు రైతు గుర్తింపు కార్డులు అందని ద్రాక్షపండులా మిగిలాయి. ఆయా గ్రామాలకు చెందిన రైతులు రోజుల తరబడి రైతుసేవాకేంద్రం వద్ద పడిగాపులు కాస్తూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రభుత్వం ఇందు కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక వెబ్‌సైట్‌లో 41 రెవెన్యూ గ్రామాల్లో వేలాది మందికి చెందిన వేల ఎకరాల భూముల జాడే లేకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. గుర్తింపు కార్డుల జారీ ప్రక్రియ గడువుతేదీ పొడిగించినా కార్డులు అందని వారు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. జిల్లాలోని పలు గ్రామాల్లో రైతు గుర్తింపు కార్డులు నమోదు ప్రక్రియ వేగంగా నిర్వహించారు. రైతుసేవాకేంద్రంలో వ్యవసాయశాఖ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వం జారీ చేసిన ప్రత్యేక వెబ్‌సైట్‌లో ఆయా గ్రామాలకు చెందిన రైతుల వివరాలు నమోదు చేస్తున్నారు. భూమి పాసుపుస్తకం, రైతు ఆధార్‌కార్డు నంబరు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన తర్వాత రైతు సెల్‌ఫోన్‌కు రెండు సార్లు ఓటీపీలు వస్తున్నాయి. చివరగా వెబ్‌సైట్‌లో ల్యాండ్ మార్కింగ్ దగ్గరకి వెళితే మాత్రం ఆయా గ్రామాలకు సంబంధించిన భూముల వివరాలు, సర్వేనంబర్లు చూపించడం లేదు. ప్రతిరోజు ఎన్ని మార్లు ప్రయత్నించినా చివరకు ఇదే ఫలితం వస్తోందని సిబ్బంది, రైతులు ఆరోపిస్తున్నారు. అలాగే ప్రభుత్వ భూములు సాగు చేసుకొంటున్న వారికి, డీకేటీ పట్టాలు పొందిన పలువురికి కుడా గుర్తింపు కార్డులు అందడం లేదని అన్నదాతలు అంటున్నారు.



గుర్రంకొండ రైతుసేవా కేంద్రంలో రైతు గుర్తింపుకార్డుల కోసం వేచి ఉన్న చిట్టిబోయనపల్లె రైతులు

భూముల వివరాలు ఆన్‌లైన్‌లో లేని గ్రామాలు:

నందలూరులో ఒకటి, రామాపురంలో రెండు, రాజంపేటలో ఒకటి, పెనగలూరులో ఆరు, చిట్వేల్‌లో ఆరు, ములకలచెరువులో నాలుగు, బి.కొత్తకోటలో రెండు, లక్కిరెడ్డిపల్లెలో ఆరు, కేవీ పల్లెలో రెండు, నిమ్మనపల్లె, గుర్రంకొండ, కలకడ మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున, సంబేపల్లెలో ఒకటి, తంబళ్లపల్లె మూడు, వీరబల్లె ఒకటి, పీటీఎం మూడు గ్రామాలు మొత్తం జిల్లా వ్యాప్తంగా 41 గ్రామాల్లో రైతుల భూముల వివరాలు ఆన్‌లైన్‌లో కనిపించడం లేదు. దీంతో గుర్తింపు కార్డుల జారీప్రక్రియ ముందుకు సాగడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

గడువు పొడిగించినా..

రైతు గుర్తింపు కార్డు నమోదు జారీ ప్రక్రియ గడువు ఈ నెల 25 వరకు పొడిగించినా రైతుల్లో ఆందోళన తగ్గడం లేదు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వం గత నెల 28 గడువు తేదీగా నిర్ణయించింది. అయినా గడువు తేదీలోగా 41 గ్రామాల రైతుల సమస్య పరిష్కారం కాలేదు. నిర్ణీత గడువు పొడిగించినా ఆన్‌లైన్‌లో భూముల వివరాలు కనిపించడంలేదని, తమ పరిస్థితి ఏమిటని రైతులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. అలాగే జిల్లాలో ప్రభుత్వ భూములు సాగు చేసుకొంటున్న వారు, డీకేటీ పట్టాలు పొందిన వారికి కూడా రైతు గుర్తింపుకార్డులు జారీ కాలేదు. ఉన్నతాధికారులు స్పందించి కార్డులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

జిల్లాలో మొత్తం రైతులు	:3,44,873
పీఎం కిసాన్ అర్హులైన వారు	:1,78,197
గుర్తింపు కార్డులు పొందని గ్రామాలు	: 41
ఇప్పటివరకు గుర్తింపు కార్డులు అందని రైతులు	:62,598

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

జిల్లాలోని పలు రెవెన్యూ గ్రామాల్లో రైతులకు రైతు గుర్తింపు కార్డులు జారీ ప్రక్రియ జరగడం లేదనే విషయం రాష్ట్రవ్యవసాయ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. గత కొన్నిరోజులుగా ఈసమస్య ఉంది. రైతు గుర్తింపు కార్డుల జారీ ప్రక్రియ గడువు ఈనెల 25 వరకు పొడించారు. అందువల్ల రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. నాలుగైదు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని అధికారులు చెబుతున్నారు.

– చంద్రానాయక్, జిల్లా వ్యవసాయాధికారి, అన్నమయ్య జిల్లా

బాగోలేదని బతిమాలినా... బండెక్కాల్సిందే!

రాష్ట్ర వ్యాప్తంగా పలు స్టేషన్లలో పోసానిపై కేసులు

సాక్షి, రాయచోటి : ప్రముఖ సినీనటుడు, రచయిత పోసాని కృష్ణమురళి ఆరోగ్యం బాగో లేదని..బ్రతిమాలినా వదల్లేదు..ఆయనను అదుపులోకి తీసుకున్న రోజునుంచి ఇప్పటివరకు ప్రతిరోజు ఎక్కడో ఓ చోటికి తీసుకు వెళుతున్న పరిస్థితి. ఈ నేపథ్యంలో సోమవారం పోసానిని పీటీ వారెంట్‌పై నరసరావుపేటకు తీసుకెళ్లేందుకు పోలీసులు రాజంపేట సబ్ జైలు వద్దకు వచ్చారు. జైలు అధికారులు పోసానికి విషయం చేరవేయగా..ఆరోగ్యం బాగాలేదని, వెళ్లలేనని చెప్పినట్లు సమాచారం. అయితే ఇప్పటికే పోలీసులు ఆరోగ్యం విషయంలో సమస్య లేకున్నా నటిస్తున్నాడంటూ బహిరంగంగా వ్యాఖ్యానించిన సంగతి అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో పీటీ వారెంటుపై సోమవారం ఉదయాన్నే పోసానిని నరసరావుపేటకు తీసుకెళ్లారు.

వేధించడమే లక్ష్యం

పవన్ కల్యాణ్‌తోపాటు పలువురు ప్రముఖులపై చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర వ్యాప్తంగా జనసేన నేతలు, కార్యకర్తల ద్వారా ఫిర్యాదులు చేయించి కేసులు నమోదు అయ్యేలా చేశారు. రాయలసీమతోపాటు పలు జిల్లాల్లో సుమారు 14–16 కేసుల వరకు పోసానిపై నమోదు చేశారు. గతనెల 26వ తేదీన హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో పోసానిని అదుపులోకి తీసుకున్న తర్వాత 27వ తేదీ కోర్టులో హాజరు పరిచారు. అక్కడ బెయిలు వస్తుందేమోనన్న అనుమానంతో ఇతర జిల్లాకు చెందిన పోలీసులు కూడా మకాం వేసి ఆయనను అదుపులోకి తీసుకోవాలని బయట వేచి ఉన్నారు. కోర్టు రిమాండ్ విధించడంతో రాజంపేట సబ్‌జైలుకు తరలించాల్సి వచ్చింది. ఈ తరుణంలో పీటీ వారెంట్ పేరుతో పలు జిల్లాలకు సంబంధించిన పోలీసులు వరుసగా రానున్నట్లు తెలుస్తోంది. ఎందుకంటే కేసులు నమోదైన తరుణంలో పీటీ వారెంట్‌పై తీసుకెళ్లి హాజరు పెట్టనున్నారు. దీంతో వరుసగా తిప్పడంతోపాటు కేసుల పేరుతో పోసానిని వేధించడమే లక్ష్యంగా సర్కార్ ఎత్తుగడలుగా కనిపిస్తున్నట్లు స్పష్టమవుతోంది.

హార్ట్ సమస్య ఉన్నా....

పోసాని కృష్ణమురళికి గతంలోనే గుండెకు సంబంధించి స్టంట్ వేశారు. ఇలాంటి తరుణంలో పోలీసులు దూర ప్రయాణం చేసే సమయంలో కనీసం వైద్యుడినైనా అందుబాటులో ఉంచుకోవాలి. అంబులెన్స్ లేకపోగా...వైద్యుడు లేకపోతే పరిస్థితి ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఏది ఏమైనా పోసాని కృష్ణమురళిని వేధింపులకు గురి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది.

క్లుప్తంగా

ఎంపీలతో ఎమ్మెల్యే భేటీ



ఎంపీలు మేడా రఘునాథరెడ్డి, మద్దెల గురుమూర్తితో ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట రూరల్ : తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి, రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డిలతో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి భేటీ అయ్యారు. స్థానిక మేడా భవన్‌కు వచ్చిన ఎంపీలతో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసుల రెడ్డి, నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఆకేపాటి సోమవారం వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. పలు విషయాలపై చర్చించారు. ఎంపీలను కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు విజయ్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్లు ఎస్. నవీన్‌కుమార్, డొంక సూరి, డొంక సురేష్, కూండ్ల రమణారెడ్డి, ఎస్.న్యామతుల్లా, విష్ణు నాయక్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

కక్షగట్టి నిప్పు పెట్టారు



కాలి బూడిదైన పైపులు, డ్రిప్‌లు

సంబేపల్లె : వైఎస్సార్‌సీపీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న ఆవుల కుటుంబ సంబంధీకుల భూములపై గత కొంత కాలంగా కక్ష సాగింపు సాగుతోంది. ఈ క్రమంలో మండల పరిధిలోని మొటుకువాండ్లపల్లె క్రాస్ సమీపంలో ఉన్న తోటకు సోమవారం గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టారు. మంటలు అధికం కావడడంతో ఫైర్ సిబ్బందికి సమాచారం అందజేశారు. స్పందించిన ఫైర్ సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే పొలంలో ఉన్న పైపులు, డ్రిప్ వైర్లు, కాలి బూడిదగా మారాయి. ఆవుల కుటుంబంపై ఇది ముమ్మాటికీ రాజకీయ కక్ష అని పలువురు చర్చించుకుంటున్నారు.

అక్రమంగా మట్టి తరలింపు


సిద్దవటం : ఉపాధి హామీ పనుల్లో భాగంగా కూలీలు పనులు చేపట్టిన ప్రాంతాల నుంచి ట్రాక్టర్‌ల ద్వారా అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. సిద్దవటం మండలంలోని టక్కోలు ఎర్ర చెరువులో గత రెండు వారాల నుంచి 60 మంది ఉపాధి హామీ కూలీలు ఫిష్ పాండ్ పనులు చేస్తున్నారు. పనులు ముగిసిన తరువాత ఇంటికి వెళ్లే సమయంలో ఉపాధి పనులు చేపట్టిన ప్రాంతాల నుంచి అక్రమంగా కొంతమంది మట్టిని ఇటుకల బట్టీలకు తరలించుకుంటున్నారు. ఒక ట్రాక్టర్ మట్టి విలువ దాదాపు రూ. 5వేలకు విక్రయించుకుంటున్నారు. ఉపాధి కూలీలు పనులు చేసిన ప్రదేశాల్లో అధికారులు కొలతలు తీసుకోక ముందే మట్టిని తరలిస్తుండటంతో కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఉపాధి హామీ ఏపీఓ నరసింహులు వివరణ కోరగా మట్టి తరలి పోకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

కూలిన విద్యుత్ స్తంభం

లక్కిరెడ్డిపల్లి: గంగమ్మ జాతరకు వెళ్తూ చాందినీ బండి ముందున్న డీజే వాహనం విద్యుత్ స్తంభానికి తగలడంతో ఒక్కసారిగా విరిగి పడిపోయింది. వందలాది మంది రద్దీగా ఉన్న చౌటపల్లి కొత్తపల్లిరోడ్డులో ఈ ప్రమాదం జరిగింది. కుర్నూతల వడ్డిపల్లికి చెందిన వ్యక్తి తలకు బలమైన గాయం తగలడంతో ఆసుపత్రికి తరలించారు. ఇంత పెద్ద ప్రమాదం జరిగినా ట్రాన్స్‌కో అధికారులు కన్నెత్తి కూడా చూడలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

మా తుఝే సలాం

- రోజా పాటించేందుకు సహర్ తప్పనిసరి
- సహరీ ఏర్పాట్లలో మహిళల కీలక పాత్ర
- వేకువ జామున మూడు గంటల నుంచే వంటల తయారీ
- ఉపవాస దీక్షతోనే పగలంతా ఇంటి పనులు



రాజంపేట టౌన్ : పవిత్ర రంజాన్ మాసంలో అనేక మంది ముస్లింలు విధిగా ఉపవాస దీక్షలు చేపడతారు. అల్లాహ్ మార్గాన్ని అనుసరించే పంచ సూత్రాల్లో మూడవది అయిన 'రోజా'కు ఎంతో ప్రాధాన్యత ఉంది. దీక్ష పాటించాలంటే సహరీ (దీక్ష ప్రారంభానికి తీసుకునే ఆహారం) తప్పనిసరి. ఈ ఆహారాన్ని తెల్లవారుజామున దీక్షకు ముందు నిర్ణీత సమయంలోపే తీసుకోవాల్సి ఉంటుంది. అందువల్ల నిర్ణీత సమయానికి ఆహార పదార్థాల తయారీలో మహిళల పాత్ర ఎంతో కీలకం. పగలంతా ఇంటి పని, సాయంత్రం నుంచి ఆధ్యాత్మిక చింతన, రాత్రి తరావీహ్ నమాజ్‌ల తరువాత నిద్రకు ఉపక్రమిస్తారు. అలాగే సహర్ ఏర్పాట్ల కోసం మహిళలు తెల్లవారుజామున మూడు గంటలకు విధిగా నిద్రలేవాల్సి ఉంటుంది. ఇక అప్పటి నుంచి కుటుంబంలోని భర్త, పిల్లలు ఉపవాసం ఉండేందుకు వంటలు చేయడం ప్రారంభిస్తారు. ఒకరోజు, రెండు రోజులు కాదు ముప్పై రోజుల పాటు మహిళలు నిద్రను త్యాగం చేస్తూ సహరీ నిర్ణీత సమయానికి ఆహారాన్ని సిద్ధం చేస్తారు. పగలు రోజా ఉంటూ, ఇంట్లోని పనులు, కుటుంబ సభ్యులకు సేవలు చేస్తూ సాయంత్రం ఇఫ్తార్‌కు వంటలు సిద్ధం చేసే 'మహిళా మూర్తులందరికి సలాం' చేయాల్సిందే. ఉద్యోగాలకు వెళుతూ కూడా రంజాన్ మాసంలో సహర్‌కు వంటలు తయారు చేసి విధులకు వెళ్లే మహిళలు కూడా ఎంతో మంది ఉన్నారు.

బర్కత్ కలిగిన సహర్

'సహరి ఖాయా కరో.. సహరి మే బర్కత్ హై' అంటూ మహమ్మద్ ప్రవక్త రసూలుల్లా సొల్లెలాహు అలైహి వసొల్లం చెప్పినట్లు ఒక హదీసు ద్వారా తెలుస్తోంది. అంటే రోజా దీక్షలకు ముందు భోజనం చేయండి, అందులో అల్లాహ్ అనుగ్రహం, పొదుపు ఉందని అర్థం. అంతటి మహత్తర సహర్ సందర్భంగా ఆహారం తీసుకుంటే శక్తితో పాటు అల్లాహ్ అనుగ్రహం లభిస్తుంది.

మహిళలకు ప్రత్యేక పుణ్యం



సహర్ కోసం వంట చేస్తున్న మహిళ

ఒకవైపు కళ్లల్లో నిద్ర ఉన్నా రంజాన్ శుభాలు, అల్లాహ్‌పై ఉన్న భక్తితో మేల్కొని వంటలు చేసే మహిళల పట్ల అనంత కరుణామయుడు ప్రత్యేక పుణ్యం ప్రసాదిస్తాడని ముస్లింల ప్రగాఢ విశ్వాసం. తనకోసమే కాదు కుటుంబ సభ్యుల దీక్ష కోసం నెలరోజుల పాటు నిద్రను త్యాగం చేసి సహర్ కోసం శ్రమించే మహిళలకు అల్లాహ్ రెండింతలకంటే అధికంగా పుణ్యం ప్రసాదిస్తాడని ముస్లీం మతపెద్దలు చెబుతున్నారు.

అల్లాహ్ ఆరాధనలో అలుపు ఉండదు



రంజాన్ మాసంలో మహిళలకు పని ఎక్కువగానే ఉంటుంది. పగలంతా ఇంటి పనులు, తెల్లవారుజామున మూడు గంటలకే నిద్రలేచి సహర్ వంటలు చేయాల్సి ఉంటుంది. ఎంతో భక్తితో రోజంతా మేము చేసే పనికి అల్లాహ్ అనుగ్రహం ఉంటుంది. అందువల్ల మేము ఎంత శ్రమించి పనిచేసినా అలుపు ఉండదు.

\- షేక్ రహమతున్నీసా, రాజంపేట

రంజాన్‌లో సేవలు సంతృప్తినిస్తాయి



రంజాన్ మాసం అంటేనే ఉపవాస దీక్షలు. భక్తితో ఉపవాసం ఉంటూనే నేను వృత్తి రీత్యా స్కూల్‌కు వెళుతున్నాను. నమాజ్, జికిర్‌లతో పాటు బాధ్యతగా తెల్లవారుజామున మూడు గంటలకే నిద్రలేచి సహర్ కోసం ఏర్పాట్లు చేస్తాను. రంజాన్ మాసంలో చేసే ఈ సేవలు నాకు ఎంతో సంతృప్తినిస్తాయి.

\- షేక్ అమీనా, ఉపాధ్యాయిని, ఉర్దూ హైస్కూల్, రాజంపేట

టీడీపీ మాజీ ఎమ్మెల్యే నుంచి రక్షణ కల్పించండి

సబ్ కలెక్టర్‌ను వేడుకున్న బాధితులు



సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు తమ సమస్యలపై ఫిర్యాదు చేస్తున్న అర్జీదారులు

మదనపల్లె : టీడీపీ మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్ నుంచి తమకు ప్రాణహాని ఉందని, అక్రమ రిజిస్ట్రేషన్‌తో ఆయన స్వాధీనం చేసుకున్న తమ ఇళ్ల స్థలాలను తమకు అప్పగించాలని కోరుతూ చేనేత కార్మికులు సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌ను వేడుకున్నారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమం జరిగింది. సబ్ కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను తీసుకుని, వారి సమస్యలను తెలుసుకున్నారు. పరిష్కార నిమిత్తం ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా బండమీదకమ్మపల్లె రెవెన్యూ గ్రామం నీరుగట్టువారిపల్లెకు చెందిన చేనేత కార్మికులు తమ కష్టార్జితాన్ని టీడీపీ మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్ కబ్జా చేశారంటూ ఫిర్యాదు చేశారు. సిరికల్చర్ కాలనీ ఏరియా సర్వే నెంబర్.423-2లో వేసిన లేఅవుట్‌లో 77మంది చేనేత కార్మికులు... 21 ఏళ్ల క్రితం కొండుపల్లె యశోదమ్మ, శ్రీనివాసులు, రెడ్డెప్పల నుంచి ఇళ్లస్థలాలను కొనుగోలు చేశామన్నారు. అందులో కొందరు ఇల్లు నిర్మించుకోగా, మరికొందరు పునాదులు వేసుకుని భద్రపరుచుకున్నామన్నారు. ఈ స్థలాలపై కన్నేసిన మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్..2020లో దేశిరెడ్డి హరినాథరెడ్డి పేరుపై జీపీఏ చేయించి, సబ్ రిజిస్ట్రార్, తహసీల్దార్‌తో చేతులు కలిపి, తమ పేర్లపై రిజిస్ట్రేషన్ జరిగిన ఇళ్లస్థలాలను వ్యవసాయ భూములుగా పేర్కొంటూ తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. తర్వాత అక్రమంగా తమ స్థలాల్లోకి ప్రవేశించి, ఇళ్ల స్థలాల హద్దులను చెరిపివేసి, అడ్డువచ్చిన వారిని భయభ్రాంతులకు గురిచేస్తూ భూమిని కబ్జా చేశారన్నారు. దీనిపై తహసీల్దార్, సబ్‌రిజిస్ట్రార్‌లను కలిసి వేడుకుంటే వారు పట్టించుకోలేదన్నారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను కలిసి వినతిచేస్తే..ఆయన మాజీ ఎమ్మెల్యే రిజిస్ట్రేషన్‌ను రద్దుచేయమని ఆదేశించినా, తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్‌లు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్ నుంచి తమకు బెదిరింపులు ఎక్కువయ్యాయని, తమకు ఏదైనా జరిగితే దానికి ఆయనదే పూర్తిబాధ్యత అన్నారు.

నాణ్యత లేని ఆహారం అమ్మితే కఠిన చర్యలు

రాయచోటి టౌన్ : నాణ్యత లేని ఆహారాన్ని ప్రజలకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ హోటళ్లు, బేకరీ యజమానులను హెచ్చరించారు. సోమవారం జిల్లా ఆహార భద్రత అధికారి డాక్టర్ కె. షమీమ్‌బాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా కేంద్రమైన రాయచోటిలోని పలు హోటళ్లు, బేకరీలను తనిఖీ చేశారు. వాటిలోని ఆహార పదార్థాలను పరిశీలించారు. వంటకాల కోసం వాడిన నూనెలను మూడు సార్లకు మించి వాడకూడదని అలా ఎక్కువ సార్లు వాడితే ఆ నూనెలు కలుషితం అవుతాయని చెప్పారు. నాణ్యతా ప్రమాణాలు పాటించని హోటళ్లను పరిశీలించి వారికి రూ.32 వేలు జరిమానా విధించారు.

పేదింటి బిడ్డకు ఎస్ఐ కొలువు



తల్లిదండ్రులతో ఎస్ఐ విశ్వనాథంలోకేష్

పీలేరు : స్థానిక ఇందిరమ్మ కాలనీకి చెందిన గిరిజన కుటుంబానికి చెందిన మూర్తి, కమలమ్మ దంపతులు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారి కుమారుడు విశ్వనాథం లోకేష్ ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు వలసపల్లె నవోదయ పాఠశాలలో చదివాడు. అనంతరం కర్ణాటక సెంట్రల్ యూనివర్సిటీలో బీఎస్సీ జాగ్రఫీ చదివివాడు. 2020లో పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు. ఇంకా ఉన్నత స్థాయికి ఎదగాలనే పట్టుదలతో చదివి 2024-25 ఎస్ఐ రిక్రూట్‌మెంట్‌లో ఎస్ఐ ఉద్యోగాన్ని సాధించాడు. తిరుపతి జిల్లాలో ఎస్ఐ పోస్టింగ్ పొందాడు.

పీజీ కామన్ సెట్ విధానాన్ని రద్దు చేయాలి



కలెక్టరేట్ ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు

రాయచోటి అర్బన్ : పీజీ కామన్ సెట్ విధానంతో పాటు జీఓ నంబర్ 77ను రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జుల వలరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 10 లక్షల మంది విద్యార్థుల ఉన్నత విద్యావకాశాలకు గండికొడుతున్న జీఓ నంబర్ 77ను వెంటనే రద్దు చేయాలని కోరారు. అనంతరం కలెక్టర్ శ్రీధర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవ్, నియోజకవర్గ నాయకులు కిరణ్‌కుమార్, గణేష్, లక్ష్మీప్రసాద్, ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి సెక్యూరిటీ గార్డుపై అంబులెన్స్ డ్రైవర్ దాడి

మదనపల్లె : ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి సెక్యూరిటీ గార్డుపై అంబులెన్స్ డ్రైవర్ దాడి చేయడంతో పాటు ఆస్పత్రి డ్యూటీ డాక్టర్‌పై దౌర్జన్యం చేసిన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. ఘటనపై బాధితుడు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. జిల్లా ఆస్పత్రి సెక్యూరిటీ గార్డు నాగేశ్వర ఆదివారం రాత్రి ఐసీయూ విభాగం వద్ద విధులు నిర్వహిస్తున్నాడు. రాత్రి 12.30 గంటల సమయంలో ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్ అల్తాఫ్ మద్యం సేవించి ఐసీయూ వార్డు ద్వారా మెటర్నటీ వార్డులోకి వెళ్లేందుకు ప్రయత్నించాడు. అదే సమయంలో అక్కడ ఉన్న నాగేశ్వర అర్ధరాత్రి వేళ అనుమతి లేకుండా మెటర్నటీ వార్డులోకి వెళ్లరాదంటూ అడ్డుకున్నాడు. దీంతో అంబులెన్స్ డ్రైవర్ ఆగ్రహంతో నాగేశ్వరపై దాడిచేసి గాయపరిచాడు. ఈ విషయాన్ని డ్యూటీ డాక్టర్, హెడ్‌నర్స్‌కు తెలిపితే...డాక్టర్ సయ్యద్ అజీజ్ ప్రశ్నించడంతో అంబులెన్స్ డ్రైవర్ ఆయనపై దౌర్జన్యం చేశాడు. ఈ విషయమై బాధితుడు నాగేశ్వర సోమవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ కోటేశ్వరికి, టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.


విద్యార్థులకు త్రుటిలో తప్పిన ప్రమాదం




విరిగిపడిన చెట్టుకొమ్మ

గాలివీడు : చెట్టు కొమ్మ విరిగి పడిన ఘటనలో స్కూల్ విద్యార్థులకు త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కవిత కథనం మేరకు.. మండల పరిధిలోని వెలిగల్లు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉదయం 8.40 గంటల ప్రాంతంలో విద్యార్థులు ప్రార్థన చేసేందుకు పాఠశాల మైదానంలో ఉన్న చెట్ల కింద నిల్చున్నారు. అయితే అక్కడే ఎత్తుగా ఉన్న సుంకేసుల చెట్టుకు ఉన్న పెలుసుబారిన బలమైన కొమ్మ ఒకటి ప్రమాదవశాత్తు విరిగి పడటంతో ఒక్కసారిగా విద్యార్థులు ఉలిక్కి పడ్డారు. ఈ ఘటనలో ఇద్దరు నాలుగవ తరగతి చదువుతున్న విద్యార్థినులకు స్వల్పంగా రెమ్మలు తాకడంతో చర్మంపై గీచులు పడ్డాయి. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించామన్నారు. అదృష్టవశాత్తు విద్యార్థులకు పెద్ద పెను ప్రమాదం తప్పిందంటూ ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

కిటకిటలాడిన గంగమ్మ ఆలయం





గంగమ్మ దేవత దర్శనం కోసం క్యూలైన్లల్లో వేచి ఉన్న భక్తులు, ప్రత్యేక అలంకరణలో అనంతపురం గంగమ్మ దేవత

లక్కిరెడ్డిపల్లె.. మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన అనంతపురం గంగమ్మ దేవాలయం జాతర ముగిసిన మరుసటి రోజు సోమవారం కూడా వేలాది మంది భక్తులతో కిక్కిరిసిపోయింది. వేలాది మంది భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రత్యేకాధికారి శ్రీనివాసులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. లక్కిరెడ్డిపల్లె సీఐ, ఎస్ఐలు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. ఆలయ పూజారులైన చెల్లు గంగరాజు, దినేష్ యాదవ్‌లు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది మార్కండేయ, శ్రీరాములు ,పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గంగమ్మ దేవత హుండీ ఆదాయం రూ.15 లక్షలు

ఈ నెల 1, 2, 3 తేదీల్లో జరిగిన మూడు రోజుల గంగమ్మ దేవత జాతర సందర్భంగా ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీలను లెక్కించారు. రూ.15లక్షల 43 వేలు 302 నగదు, బంగారం రూపంలో 11 గ్రాములు, వెండి రూపంలో 1 కేజీ 928 గ్రాములు వచ్చినట్లు ఆలయ ప్రత్యేకాధికారి శ్రీనివాసులు తెలిపారు. ఈ మొత్తాన్ని ఆలయ ఖాతాకు జమ చేసి అభివృద్ధికి ఖర్చు చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూజారులు చెల్ల గంగరాజు, దినేష్ యాదవ్, చంద్ర, వెంకటేశ్వర్లు, రెడ్డిశేఖర, కమిటీ సభ్యులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

నిర్ణీత సమయంలోగా సమస్యలు పరిష్కరించాలి

జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు



ఎస్పీ కార్యాలయానికి వచ్చిన దివ్యాంగుడి సమస్యను వింటున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి ఎస్పీ నేరుగా ఫిర్యాదులను స్వీకరించి ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఫిర్యాదులను సంబంధిత పోలీసు అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు.

నడవలేని స్థితిలో వచ్చిన ఫిర్యాదు దారులతో..

మదనపల్లె మండలం, కోళ్లబైలు గ్రామం నుంచి వచ్చిన ఎ.సలావుద్దీన్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి నడవలేని స్థితిలో స్ట్రెక్చర్ పై ఎస్పీ కార్యాలయానికి వచ్చారు. తాను టీవీఎస్ వాహనంలో వెళ్తుండగా ఎదురుగా బైక్‌పై వస్తున్న వ్యక్తి ఢీకొట్టగా తీవ్రగాయాలయ్యాయని, తనకు నష్టపరిహారం, ఆసుపత్రి ఖర్చులు ఇప్పించేలా సహాయం చేయాలని ఎస్పీని వేడుకున్నారు. దీంతో అతని సమస్యను పరిష్కరించాలని మదనపల్లె ఒకటో పట్టణ సీఐకి ఎస్పీ ఆదేశాలు ఇచ్చారు. అలాగే నందలూరు మండలం, నాగిరెడ్డిపల్లి నుంచి వచ్చిన ఎస్.హుస్సేన్ బాషా నడవలేని స్థితిలో కుటుంబ సభ్యుల సాయంతో వచ్చారు. కాలు విరిగి వైద్యం కోసం దాచుకున్న నగదును పరిచయస్తుడైన వ్యక్తి తీసుకొని ఇవ్వలేదని, డబ్బులు ఇప్పించేలా న్యాయం చేయాలని ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. సమస్యను పరిష్కరించాలని నందలూరు ఎస్ఐను ఎస్పీ ఆదేశించారు.

మజ్జిగ పంపిణీ..

ఎండలు ప్రారంభం కావడంతో కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదుదారులకు ఇబ్బందులు కలగకుండా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు మజ్జిగ పంపిణీ చేశారు.

పని భారం అంతా మా పైనేనా ?

ఎంపీడీఓ ఎదుట డీడీఓల అసంతృప్తి

పెద్దతిప్పసముద్రం: మండలంలోని పలు సచివాలయాల్లో పని చేస్తూ డీడీఓ అధికారాలు ఉన్న పంచాయతీ కార్యదర్శులు సోమవారం ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ ఎదుట అసంతృప్తి గళం విప్పారు. ఈ సర్వే , ఆ సర్వే అంటూ మొత్తం 41 సర్వేల భారం అంతా తమపైనే రుద్దుతారా, మిగిలిన శాఖల అధికారుల గురించి మీరెందుకు పట్టించుకోవడం లేదు సార్ అంటూ ఎంపీడీఓను ప్రశ్నించారు. వీఆర్‌ఓ, సర్వేయర్ చూస్తే రీసర్వే అంటారు, ఆర్ఎస్‌కే అసిస్టెంట్‌ను అడిగితే ఫార్మర్ రిజిస్ట్రీ అంటారు. వెటర్నరీ, ఏఎన్ఎంలను సర్వే చేయమంటే సీజనల్ వ్యాధులని ఈ వ్యాక్సిన్, ఆ వ్యాక్సిన్ అంటారు. కొంత మంది గ్రేడ్-5 కార్యదర్శులు చూస్తే నెలల తరబడి సెలవులో వెళ్లిపోతారు. కొన్ని చోట్ల డీఏ, వెల్ఫేర్ పోస్టులు ఖాళీగా ఉన్నా ఆ పని భారం కూడా తమపైనే రుద్దుతారా అంటూ అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని సర్వేలు తామే చేయడమే గాక మిగిలిన వారికంతా 1వ తేదీ లోగా జీతాలు వచ్చేలా చూడాలి. ఇంత గొడ్డు చాకిరి చేసే తమకు మాత్రం 1వ తేదీ కాకుండా 20వ తేదీ జీతాలు ఎలా వస్తాయి అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. డీడీఓల ఆవేదనపై స్పందించిన ఎంపీడీఓ పక్కనే ఉన్న తహసీల్దార్ శ్రీరాములు నాయక్‌తో చర్చించారు. సర్వేకు వీఆర్‌ఓలు, సర్వేయర్లు సహకరించేలా చూడాలని ఎంపీడీఓ సూచించారు. తహసీల్దార్ కూడా సానుకూలంగా స్పందించడంతో డీడీఓలు శాంతించారు.

కష్టపడిన వారికే పదవులు ఇవ్వాలి

జయచంద్రారెడ్డికి పోటీగా శంకర్ వర్గం సమావేశం



బి.కొత్తకోటలో సమావేశమైన శంకర్ వర్గీయులు

బి.కొత్తకోట : పార్టీ కోసం కష్టపడిన తమకే పదవులన్నీ కట్టబెట్టాలని మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్ వర్గీయులు డిమాండ్ చేశారు. సోమవారం బి.కొత్తకోటలో సమావేశమైన వీరంతా అధికారిక పదవులపై చర్చించారు. ఓడిపోయిన టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి వర్గానికి పదవులు ఇవ్వరాదని డిమాండ్ చేశారు. పార్టీ కోసం కష్టపడింది తామేనని, పదవులు శంకర్ వర్గానికి ఇవ్వడమే న్యాయమని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని టీడీపీ జోన్ ఫోర్ ఇన్‌చార్జ్ దీపక్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించి నివేదిక ఇవ్వాలని కోరినట్టు శంకర్ వర్గీయులు తెలిపారు. శంకర్ ఆదేశాలతోనే ఈ సమావేశం నిర్వహించామని నాయకులు చెప్పడం గమనార్హం. కొంతకాలంగా నిశ్శబ్దంగా ఉన్న వర్గ పోరు మళ్లీ బహిరంగమై పోటాపోటీగా సమావేశాలు పెడుతున్నారు.ఈ పోటీ సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు నారాయణస్వామి రెడ్డి, పోల్ కోఆర్డినేటర్ కుడుము శ్రీనివాసులు, టౌన్ అధ్యక్షుడు బంగారు వెంకటరమణ, క్లస్టర్ ఇన్చార్జి కనకంటి ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ సుకుమార్, ప్రధాన కార్యదర్శి దేవరింటి కుమార్ పాల్గొన్నారు.

ఓపెన్ ఇంటర్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్



ఓపెన్ ఇంటర్ పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులు పడేసిన స్లిప్పులు

మదనపల్లె : సార్వత్రిక విద్యాపీఠం(ఓపెన్ స్కూల్ సొసైటీ) ఇంటర్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జోరుగా సాగింది. సోమవారం ఓపెన్ ఇంటర్ పరీక్షలు పట్టణంలోని జెడ్పీ ఉన్నతపాఠశాల, కోటబడి హోప్ మున్సిపల్ హైస్కూల్, రామారావుకాలనీ బాపూజీ మున్సిపల్ హైస్కూల్ కేంద్రాల్లో ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యాయి. సుమారు 550 మందికి పైగా విద్యార్థులు మూడు కేంద్రాల్లోనూ పరీక్షలకు హాజరయ్యారు. రెగ్యులర్ ఇంటర్ పరీక్షలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో లైవ్ స్ట్రీమింగ్‌లో పర్యవేక్షణ జరుగుతోంది. అయితే ఓపెన్ ఇంటర్ పరీక్షలు మాత్రం ఇందుకు భిన్నంగా, ఎలాంటి బందోబస్తు లేకుండా ఇన్విజిలేటర్లు స్వయంగా విద్యార్థుల చేతికి స్లిప్పులు అందించి కాపీయింగ్‌కు సహకరించారు. సాధారణంగా పలు కారణాలతో కళాశాలలు, పాఠశాలలకు వెళ్లని అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరవుతుంటారు. ఇంకా ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు తమ ఉద్యోగోన్నతి కోసం ఓపెన్ ఇంటర్ స్కూల్ పరీక్షలు రాస్తున్నారు. ఇదే అదనుగా భావించిన స్టడీ కేంద్రాల నిర్వాహకులు అభ్యర్థులు ఒకొక్కరి నుంచి రూ.10 నుంచి 12 వేలు వసూలు చేసినట్లు సమాచారం. ఈ మొత్తంలో విద్యాశాఖాధికారులకు, ఇన్విజిలేటర్లకు వాటాలు ముట్టజెప్పినట్లు విశ్వసనీయ సమాచారం. మధ్యాహ్నం 12 గంటలకు పరీక్ష ముగిశాక, పరీక్షా కేంద్రాల వద్ద ఎక్కడ చూసినా విద్యార్థులు పడేసిన స్లిప్పులు కనిపించాయి. ఓపెన్ ఇంటర్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌పై ఎంఈఓ-2 రాజగోపాల్‌ను వివరణ కోరితే... పరీక్షలు పకడ్బందీగా నిర్వహించామన్నారు. మాస్ కాపీయింగ్‌కు అవకాశమే లేదని, పరీక్ష నిర్వహణ పారదర్శకంగా నిర్వహించామన్నారు. స్టడీ సెంటర్ల నిర్వాహకుల డబ్బు వసూళ్లు తమ దృష్టికి రాలేదన్నారు.

అగ్నికి ఆహుతైన మామిడి చెట్లు



కాలిపోయిన మామిడి చెట్ల వద్ద బాధితుడు పోలా శ్రీనివాసులు

గాలివీడు : ఆకతాయిలు పెట్టిన అగ్నికి మామిడి చెట్లు ఆహుతి అయ్యాయి. బాధితుని కథనం మేరకు.. నూలివీడు పంచాయతీ శ్రీనివాసపురానికి చెందిన పోలా శ్రీనివాసులు గ్రామ సమీపంలో మామిడి చెట్లను పెంచుతున్నాడు. సోమవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు సమీపంలోని గుట్టకు నిప్పు పెట్టడంతో నిప్పు అక్కడి నుంచి వ్యాపించి మామిడి తోటకు అంటుకుంది. దీంతో అందులోని దాదాపుగా 40 వరకు చెట్లు కాలిపోయినట్లు బాధితుడు తెలిపాడు. మామిడి చెట్లకు 10 సంవత్సరాలకు పైబడి వయస్సు ఉంటుందని, మామిడి చెట్లను బతికించుకోవడానికి వేల రూపాయలు ఖర్చు పెట్టి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేశానని తెలిపాడు. బాగా పూతకు వచ్చిన దశలో నిప్పు పెట్టడంతో చెట్లు మొత్తం కాలిపోయాయని వాపోయాడు. అధికారులు స్పందించి ప్రభుత్వం నుంచి సహాయం అందజేయాలని ఆయన కోరాడు.

భక్తిశ్రద్ధలతో ధ్వజావరోహణం



భద్రకాళీ సమేతుడికి వసంతోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు, ఆలయ అర్చకులు

రాయచోటి టౌన్ : రాయచోటిలోని వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 9వ రోజు స్వామి వారి ధ్వజావరోహణ కార్యక్రమాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం మఠాధిపతి వేదపండితులు శ్రీ మఠం ఓంకార స్వామి శిష్యగణం ఆధ్వర్యంలో వేదమంత్రాల మధ్య ఈ కార్యక్రమం జరిగింది. అంతకు ముందు హోమం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. అనంతరం స్వామి వారి బ్రహ్మోత్సవాల కంకణధారణలు విసర్జింప జేశారు. తర్వాత వసంతోత్సవ కార్యక్రమం అత్యంత కోలాహలంగా చేపట్టారు. ఈ పూజలు ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు శంకరయ్య స్వామి, కృష్ణయ్య స్వామి, శేఖర్ స్వామి, వేదపండితులు రాచరాయ యోగి స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు.